# హేండ్సప్

"ప్రగతి మైదాన్‌లో పుస్తక ప్రదర్శనలు, వెళ్ళొస్తాను ఆలస్యమైతే కంగారు పడకు" ఢిల్లీ ఉత్తర ప్రాంతంలోని మిరాండా హౌజ్ టీచర్స్ ఫ్లాట్‌లో ఉంటున్న సుజాత తల్లితో చెప్పింది.

"ఇవాళ కాలేజీ లేదూ?"

"ఉంది. ఒక్కటే క్లాసు అది తీసుకున్నాక అలా వెళ్తాను ఏదో ఎలక్షన్ల హడావుడి. ఇక క్లాసులుండవు".

"అయితే మన పూనా వెంకటిగాడికి ఏమైనా చిన్నచిన్న తెలుగు పుస్తకాలున్నాయేమో చూడు వాడికి కథల పుస్తకాలంటే భలే ఇష్టం"

"వాడికి తెలుగు అక్షరాలు చదవడం వచ్చా?"

"కిందటి సంవత్సరం నేనక్కడ ఉన్నప్పుడు రోజుకు ఒక తెలుగు అక్షరం చెప్తాను నేర్చుకోరా, అక్షరానికో తాయిలం పెడతాను అన్నాను. రెండు అక్షరాలు నేర్చుకుంటే ఏమిస్తావ్ అని అన్ని అక్షరాలూ నేర్చేసుకున్నాడు. చిన్న చిన్న వాక్యాలూ, కాకీ నక్కా కథలూ కూడబలుక్కుంటూ చదివేస్తాడు...."

✣ ✣ ✣

ఉదయం పదకొండున్నరకు ప్రగతి మైదాన్‌లో జన ప్రవాహం జోరందుకుంది. షాపులు కళకళలాడుతున్నాయి. సైకాలజీకి సంబంధించినవి రెండు పుస్తకాలు కొనుక్కుని చిన్న పిల్లలకు కేటాయించిన దుకాణాల్లోకి వెళ్లింది. చిన్న వయసు పిల్లకు కావలసి తెలుగు పుస్తకాలు తృప్తికరంగా లేక పోవడంతో ఇటూ అటూ తిరుగుతూ మేడమెట్ల దగ్గర 'కాన్ఫరెన్స్ హాల్' అన్న బోర్డు చూసింది. తివాచీ పరచిన మెట్లెక్కి ఏం జరుగుతుందో అని కుతూహలంగా తొంగి చూసింది.

ఆతర్స్ గిల్డ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశమట. వేదిక మీద పెద్దలున్నారు. వెనుక నల్లబల్ల మీద 'ఉగ్రవాదం - రచయిత బాధ్యత' అన్న అక్షరాలు హిందీలో స్పష్టంగా రాసి ఉన్నాయి. ఉదొత్తుల పరిమళం ఆ హాలంతా అలుముకొని ఉంది. అబ్బో ఇదేదో చాలా బరువైన వ్యవహారంలానే ఉందనుకుని వెనక్కి ఓ అడుగు వెయ్యబోతూ ఉంటే వేడి వేడి తేనీటి కప్పును ఒక ఆవిడ అందించి, రంగుల కరపత్రాన్ని ఇంకో చేతిలో ఉంచి ఖాళీగా ఉన్న కుర్చీలో కూలదోసింది. నేను రచయిత్రిని కానమ్మా అన్నా వినిపించుకోకుండా ఇంకెవరో పెద్దమనిషి వస్తే అటుగా వెళ్ళిపోయిందా కార్యకర్త. తేనీరు రుచి చూస్తున్నందుకైనా కాస్తంత కూర్చోవడం న్యాయమనిపించి సుజాత వేదిక మీద వక్తల అభిప్రాయాలు వింటోంది. నలుగురు వక్తలు నాలుగు కోణాల్లోంచీ ఉగ్రవాదాన్ని విశ్లేషిస్తూ చక్కగా మాట్లాడారు. రకరకాల వాదాలు వింటూ సమస్య బరువైనది కావడం వల్ల సుజాత మనసు బరువెక్కిపోయింది. చేతి గడియారాన్ని చూసుకుంటూవుంటే ఒక ముసలాయన సమస్యని కొత్త కోణంలోంచి చూపుతూ, 'బతుకు ఎంతో విలువైందని ఇంట్లోని పసివాళ్ళకు చెప్పే తీరికా, ఓపికాలేని ఈ తరం అందుకుంటున్న కానుకే ఈ ఉగ్రవాదం' అని రెండు కళ్ళూ మూసుకుని నిట్టూర్చాడు. సుజాత నెమ్మదిగా లేచి మెట్లు దిగుతోంది కిందికి పోవాలని. హిందీలో సాగినా ప్రసంగాలు బావున్నాయి.

వెనకాలే 'హేండ్సప్' అన్న అరుపు వినిపించింది. చట్టున వెనక్కి తిరిగింది. మొహానికి నల్లని ముసుగు, చేతిలో రివాల్వరు, ఆరు జేబుల ట్రౌజరు, గాఢమైన రంగుల టీషర్టులో ఉన్న శాల్తీని చూసి ఒక్క క్షణం అవాక్కయిపోయింది. మరుక్షణమే పక్కుమని నవ్వేసింది ఆపుకోలేక. ఆ బుడతగాడికి మహా ఉంటే ఆరేళ్ళుంటాయి. లేకపోతే గుండె ఆగేపనే.

పరుగున వచ్చి వాడి మీదకు వంగి రెక్కపట్టుకుని "తూ ఇదర్ బద్మాష్.... మై సారీ దునియా ఢూండ్ రహీ హూఁ" అంటున్న పంజాబీ దుస్తుల్లోని యువతిని చూసింది సుజాత. ఆమె కూడా తలెత్తి చూశాక ఒక్క క్షణం నిశ్శబ్దం. కళ్ళలో ఏదో ఆశ్చర్యం "నువ్వు స్వర్ణవి కావూ?" సుజాతే సాహసించింది.

"ఓ.... సునందా.... ఐ మీన్ సుజాతా! ఆఫ్టర్ వెరీ లాంగ్‌టైమ్....." అని గుర్తుపట్టిన సంకేతాన్ని అందించిందా యువతి. ఇది వరకు బాగా చిన్నతనంలో ఒకమారు, ఆ తర్వాత బంధువుల పెళ్ళిళ్లలో రెండుసార్లూ పరిచయమైన స్వర్ణకు చేతులు అందించింది సుజాత. బయటకు ప్రకటించకపోయినా, మనసులో ఒక ప్రశ్న మెదిలింది. అమలాపురం పరిసరాల్లో పెరిగిన అమ్మాయి ఎంతగా ఆ తర్వాత ఉత్తరదేశం చుట్టబెట్టినా మరీ ఇంతగా రూపాంతరం చెందడమే దానికి కారణం. అయితే, ఏ పంజాబీనో, మరెవర్నో పెళ్ళి చేసుకుని ఉండవచ్చు అని సమాధానపరచుకుంది. "ఎక్కడో అల్మోరాలో ఉన్నట్టు విన్నాను....."

"అవును. రీసెంట్లీ వియ్ కేమ్ హియర్. మై హబ్బీ ఈజ్ ఏ మెకానికల్ ఇంజనీయర్ ఇన్ ద ఆర్మీ. ఏ మేజర్. నేను ప్రజంట్లీ ఏ సైంటిస్ట్ ఇన్ ద రిసెర్చ్ ఇనిస్టిట్యూట్...." అంటూ ఒక విజిటింగ్ కార్డు పర్సులోంచి తీసి ఇచ్చింది స్వర్ణ. అందులో ప్రోబిన్ రోడ్ అన్న పేరు చూడగానే ఆ ప్రాంతమంతా తనకు బాగా పరిచయమైనదే అనుకుంది సుజాత. స్వర్ణ ఏదో మాట్లాడబోతూ ఉంటే ఆ చిన్న హీరోగాడు అసహనంగా బుగ్గలు పట్టుకుని తనవేపుకి తిప్పుకుంటూ చిప్స్ కావాలని మారాం చేయడం తట్టుకోలేక "వన్ మినిట్ సుజాతా" అంటూ పోయి రెండు పేకెట్లు చిప్స్ కొని వాడి నోరు మూయించింది. ఆ తర్వాత "వైడోన్ట్ యూ కమ్ విత్ మీ నౌ" అంది. ఆ గేటూ, మేధావుల నివాసాల సమూహాలు తన ఫ్లాట్‌కి మరీ దూరం కావని, తెరచిన కారులో ముందు సీట్లో కూర్చుంది సుజాత. కారు కదిలిందే తడవుగా ఆఫ్రికన్ పాప్ మ్యూజిక్ ఊపందుకుంది. దానికి కాస్త అనుగుణంగా తల ఊపుతూ స్టీరింగ్ పట్టుకుంది స్వర్ణ. వెనుకగా చిప్స్ కరకరలాడిస్తున్న చోటూ సుజాత ఒళ్ళోకి దూకి వాల్యూమ్ బాగా పెంచేశాడు. స్వర్ణతో ఏం మాట్లాడాలన్నా తన గొంతు హెచ్చు స్థాయికి పెంచుకోవలసి రావడంతో శ్రమ అనిపించి మౌనంగా వెనక్కు పరిగెడుతున్న వాహనాలనీ, జన ప్రవాహాన్నీ చూస్తోంది.

ప్రొబిన్ రోడ్డు రానే వచ్చింది. అదే రోడ్డులో రద్దీ ఎక్కువ ఉండని కారణంగా సుజాతా, ఆమె సహోద్యోగినీ సాయంత్రం నడచి చివరిదాకా వెళ్ళి 'ఏ ఆమ్ రాస్తా నహీఁ హై' అన్న బోర్డు - గేటూ కనపడగానే వెనకకు మళ్ళి ఇళ్ళు చేరడం ఆనవాయితీ. ఆ గేటుకు దగ్గరగానే 'ఫర్ డిమాలిషన్' అన్న అక్షరాలు ముద్రించుకుని పాకుడు పట్టిన గోడలతో ఉన్న నాలుగైదు పాడుబడ్డ అపార్టుమెంట్లూ, అందులో అడుగున నిర్భయంగా బతుకుతున్న బీదా బిక్కీ రోజూ కనిపిస్తూ ఉంటారు. వాళ్ళ ధైర్యానికి ఆశ్చర్యపోతూ ఉంటుంది.

ఆ గేటు లోపలి భవంతుల్లోని సర్వెంట్ క్వార్టర్‌లో ఏదైనా అవకాశం దొరికితే ప్రయత్నించడం కోసం అలాంటి వాళ్ళు అక్కడ ఉంటారని వేడి వేడి పాప్ కారన్ అమ్ముకునే బీహార్ స్త్రీ చెప్పాక మరీ ఆశ్చర్యపోయింది. ఆ పాడుబడ్డ బిల్డింగులు ఎప్పుడు కూలుతాయో అన్న భయమే లేదు. **అన్నిటికీ తెగించిన ఆశాజీవులు వాళ్ళు అనుకుంటుంది.**

రక్షక భటుడు గేటు తెరవడం కోసం కాస్త జోరు తగ్గిన కారు ఆ వెంటనే బాణంలా సన్నటి రోడ్డు మీద లోపలికి దూసుకుపోయి ఒక పోర్టికోలో ఆగింది. పాప్ మ్యూజిక్ శబ్దం కూడా వాన వెలిసినట్టు ఆగిపోయింది. స్వర్ణ కారు తెరచుకుని నిలుచుంది. ఆమెతో పాటే సుజాత కూడా లేచి వచ్చి చుట్టూ కలయజూసింది.

నున్నటి రోడ్డు, ఇరువైపులా పచ్చని చెట్లూ, ఎత్తయిన భవన సముదాయాలూ, వాటి మధ్య పిల్లల కోసం పార్కులూ, పెద్ద ఆటస్థలం చూస్తూ ఎంతటి అదృష్టవంతులీ ఆవరణలో నివాసులు అనుకుంది.

స్వర్ణ కారు హారన్ అసహనంగా మోగించి విసుగ్గా "మమతా" అని గొంతు పెంచి అరచింది. ఆ పోర్టికోకు కాస్తంత దూరాన వీధి వైపున పాడుచుకు వచ్చిన బాల్కనీ గోడ మీంచి ఒక లేత మొహం తొంగి చూసింది. మరో నిమిషంలో ఎదురుగా పదేళ్ళు నిండని అమ్మాయి వచ్చి నిల్చుంది. స్వర్ణ చేతిలోని సంచినీ, చోటూగాడి చేతిని అందుకుని వాళ్ళని నీడలా అనుసరించింది.

"మమ్మీ! నాకు ఎయిర్‌పోర్ట్ సెట్ కొనిస్తానన్నావు! సబ్ ఝూట్ హై" అని గునుస్తూ ఫ్లాట్‌లోకి పోతూ ఉంటే పాలితన్ ప్యాకెట్‌లో మిగిలిపోయిన చిప్స్ చూర వాడి వెనుకనే ధార కట్టినట్టు తివాచి మీద పడింది. సోఫాలో బోర్లాపడుకుని బూటు విప్పని కాళ్ళు రెండూ గాలిలో ఊపుతున్నాడు. ఆ జోళ్ళు విప్పి సాక్స్ ఊడదీసే ప్రయత్నం చేస్తోంది మమత. కానీ, ఏ కాలూ స్థిరంగా ఉంచక అటూ ఇటూ ఊపుతూ ఆ పిల్లను విసిగిస్తున్నాడు. ఆ చిన్నదాని మొహంలో, ఆ విసుగుదలను ప్రకటించే సాహసం చేయకుండా, లేత వయసులోనే జీవితావసరంగా సంపాదించుకున్న ఓర్పు కనబడుతోంది. నిశితంగా అటువేపే చూస్తున్న సుజాతలో ఏదో నిస్పృహ నీడలా కదలాడింది.

"సుజాతా! రా. ప్లీజ్ కమ్. వియ్ విల్ హేవ్ లంచ్" అన్న స్వర్ణ పిలుపుతో నిస్పృహలోంచి బయటపడి టేబుల్ దగ్గరకు లేచి వెళ్ళి కూర్చుంది. మమత గ్లాసులు పెట్టి నీళ్ళు నింపి పళ్ళాలు అమర్చింది.

"మనం ఇలా ఇన్నాళ్ళకు కలవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రగతి మైదాన్ రాబట్టి....." అంటూ ఏదో మాటలు కలిపింది సుజాత.

"అవును. మా డైరెక్టరు మాక్కావలసిన పుస్తకాలేవైనా ఉంటాయేమో చూడమన్నాడు. మంచి అవకాశం. ఒకరోజు కనీసం ఐ కెన్ బ్రేక్ మై మొనాటనీ అనుకున్నాను". అన్నం వడ్డిస్తున్న స్వర్ణ మమత వేపు తిరిగి ఏదో మరచిన విషయం గుర్తుకు వచ్చినట్టు. "క్యా హోగయా తేరీ మమ్మీ క్యోం నహీఁ ఆయీ...." అని గంభీరంగా మొహం మార్చేసింది. "కల్ ఆయేగీ" అని తలవంచుకుంది మమత.

"అద్దె అక్కరలేకుండా ఫ్రీగా సర్వెంట్ క్వార్టర్స్ ఇస్తే వచ్చి దూరిపోవాలని ఆశ. తీరా రమ్మనగానే మీ ఇంట్లో పని ఎక్కువ. అదనంగా రెండొందలు ఇవ్వమని బేరం" అని సుజాత వేపు చూస్తూ తనకు జరుగుతున్న అన్యాయాన్ని ఏకరవు పెడుతోంది. "నేను వెర్రిదాన్నా ఏం! దీని తల్లి కన్నా రెండాకులు ఎక్కువ చదివాను. రెండొందలు ఇస్తానని ఈ చిన్నదాన్ని ముందు రానిచ్చాను. దీని కష్టం చూడలేక తల్లి రాజీపడక చస్తుందా! అది క్వార్టర్‌లోకి వచ్చిన తర్వాత ఈ రెండొందలు నేనెందుకు

ఇస్తాను? జాడూ, పోచా, బరతన్ కపడా కన్నా ఏం ఎక్కువ పని ఉందని...." ధారాళంగా తెలుగులో మమతకి అర్థం కాదని తన వ్యూహ రచన వివరిస్తోంది స్వర్ణ. అప్పటి దాకా కత్తెర పట్టుకుని ఆనాటి న్యూస్ పేపర్ని తునాతునకలుగా కత్తిరించి తివాచీ మీద పోసిన చోటూ టేబుల్ దాకా వచ్చి "మమ్మీ అయ్ వాంటేనామ్లెట్" అన్నాడు. మమత స్టౌవ్ వెలిగించి కోడిగుడ్డు అట్టు పోసి ప్లేటులో పెట్టి ఫోర్కూ కత్తీ పక్కనే అమర్చింది.

"కంటోన్మెంట్‌లో ఇచ్చే క్వార్టర్ తీసుకుంటే మా ఆయనకి పిలిస్తే పలికే బలగం ఎక్కువగానే ఉంటుంది. ఈ చేతకాని పనివాళ్ళతో చేయించుకుంటూ నేను ఇంతగా అవస్థ పడనక్కరలేదు. కానీ, నాకు నా ఇనిస్టిట్యూట్ దగ్గర కదా అని ఇలా ఇక్కడ ఏడుస్తూ సర్దుకుపోతున్నాను." ఇలా తన ఓర్పును వివరించుకుపోతున్న స్వర్ణ ఒక్క ఉదుటున లేచి చోటూ దగ్గరకి వెళ్ళింది. సుజాత కారణం అర్థంకాక చూస్తోంది.

"నీకెన్ని మార్లు చెప్పాలి! స్టుపిడ్ ఫెలో. హౌమెనీ టైమ్స్ టు టెల్ యూ" అంటూ ఆ చిన్నవాడి ఎడమ చేతిలో ఫోర్క్ పెట్టి, కుడిచేతిలో నైఫ్‌ని ఉంచింది.

"టేబుల్ మేనర్స్ నేర్చుకోకపోతే పార్టీలో క్లమ్జీగా బిహేవ్ చేస్తారు సుజాతా!" అంది బోలెడు విసుగును ఒక నిట్టూర్పుతో రైల్ ఇంజన్‌లా విడిచిపెడుతూ.

సరిగ్గా అదే సమయనికి ఒక ఫోన్ కాల్ రావడంతో, "మమతా! కార్డెలెస్ లావ్" అని చేత్తో అందుకుని అనునయ పూర్వకంగా గొంతుమార్చి హిందీలో ఏదో మాట్లాడి, సుజాత వేపు, కాస్తంత అపరాధ భావంతో చూసి, "సుజాత! ఏమీ అనుకోవు కదా. నేను ఇప్పుడే మా కలీగ్‌ను చూసి వచ్చేస్తాను. కాస్త అర్జంట్ వ్యవహారమే. ప్లీజ్ బీ ఏట్ హోమ్" అని భరోసా ఇచ్చి వెళ్ళింది.

ఈ వెళ్ళి వచ్చే వ్యవధిలో సుజాత తనకు పరిచయం లేని ఒక వింత ప్రపంచాన్ని విస్తుపోతూ చూసింది. విశాలమైన డ్రాయింగ్ రూమ్ కాక మరి రెండు పెద్ద గదులు ఆ ఫ్లాట్‌లో ఉన్నాయి. ఆరెండు గదుల్లోంచి వీధి వైపుగా ఉన్న బాల్కనీలోకి దారి ఉంది. ఒక గదిలో గోడకి వేలాడుతూ బ్లాక్ అండ్ వైట్ ఫొటో పాతకాలపుది ఉంది. పోలీస్ ఆఫీసర్ దుస్తుల్లో ఉన్న పెద్ద మనిషి నడుముకు వేలాడుతున్న పిస్టల్‌తో

గంభీరంగా ఉన్నాడు. మీసాలు మెలిపెట్టి ఉన్నాయి. ఆ గదిలో పెద్ద టీవీ సెట్ ఉంది. వాటిని చూస్తూ బాల్కనీలోకి వెళ్ళి నిలుచుంది సుజాత.

కంటికింపుగా విశాలమైన ఆటస్థలం సరిగ్గా ఆ ఫ్లాట్‌కి ఎదురుగానే ఉంది. దాని విస్తీర్ణం సుమారు ఒక ఫుట్‌బాల్ కోర్టులో సగం ఉంటుంది. కిందంతా తివాచీ పరచినట్టు సమమట్టంగా కత్తిరించిన పచ్చగడ్డి. చుట్టుతా ఏపుగా పెరిగిన చెట్లు, కొన్ని చెట్లు ఆకులన్నిటినీ రాల్చేసి ఎఱ్ఱటి పూలతో మిగిలి పోయాయి. రావి చెట్లు కొత్తగా వచ్చిన పల్చని ఆకుల్ని మిలమిలా మెరిపిస్తూ గాలిలో కదులుతున్నాయి. ఎండ తీవ్రత కొంత ఉన్నా, లెక్క చెయ్యకుండా పది పదకొండేళ్ళ వయసు పిల్లలు బంతితో ఆడుతూ, పతంగులు ఎగరేసుకుంటూ ఉన్నారు. వాళ్ళనీ, వాళ్ళ కోలాహలాన్నీ చూస్తే సుజాతకి మరో మారు బాల్యావస్థ గుర్తుకు వచ్చింది.

మమత ఆమెకు కాస్తంత దూరంగా వచ్చి నిలబడి వింతగా విప్పారిన కళ్ళతో ఇంటికి కొత్తగా తొలిసారి వచ్చిన వ్యక్తిని చూస్తోంది. ఇంతలో ఆటస్థలం అంచులో ఉన్న ఆరేళ్ళ చిన్నవాడొకడు 'దీదీ' అని మమతను పిలిచాడు. "ఎవరు వాడు?" అని కుతూహలంగా అడిగింది సుజాత.

"మా తమ్ముడే నా పని అయిపోయాక ఇంటికి వెళ్ళేటప్పుడు వాణ్ణి నాతో తీసుకుపోతాను" ముద్దుగా, స్పష్టంగా హిందీలో మాట్లాడుతోంది మమత.

" మీ ఇల్లెక్కడ?"

"మాకు ఇక్కడ సర్వెంట్ క్వార్టర్స్ ఇంకా ఇవ్వలేదు మేడమ్ మాకు ఇచ్చేదాకా ఈ గేటు బయట పాతబడ్డ ఒక ఇంట్లో ఉంటున్నాం."

"మీరు స్కూలికి వెళ్ళరా?" సుజాతకి ఈ ప్రశ్న అర్థం లేనిదని తెలిసినా ఆ పిల్ల ఏమంటుందో వినాలని అడిగింది.

ఇక్కడ ఆడుతున్న పిల్లలెవరూ స్కూళ్ళకి వెళ్ళరు. వీళ్ళంతా ఇక్కడ సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉంటున్న వాళ్ళే. సాయంకాలం ఈ ఫ్లాట్స్‌లోని పెద్ద పిల్లలు సూళ్ళ నుంచి వచ్చి బంతాటలాడుకుంటారు. అంతవరకూ ఈ పిల్లలు ఇలా ఆడతారు. తర్వాత వీళ్ళంతా వెళ్ళిపోతారు."

బాల్కనీ అంచులో గమేలాలున్నాయి. వాటిలో ఏవో పూలమొక్కలున్నాయి కానీ, శ్రద్ధగా నీరు పోస్తున్న జాడ లేదు. ఆకులు ఎండిపోతున్నాయి. వాటిలో చిన్నచిన్న రంధ్రాలు ఏదో మిషన్‌తో క్లిప్ చేసినట్టున్నాయి. అలా తూట్లుపడ్డ ఆకుల్ని చూస్తూ ఏదో చీడ పట్టిందేమో అనుకుంది సుజాత. అలా నిశితంగా అటు చూడ్డం గమనించిన మమత- "చోటూ తితిలియోంకో మర్తా" అంటూ ఏదో చెప్పబోయింది. అప్పటికే ఇలా ఇరుక్కుపోయినందుకు కొంత విసుగనిపించిన సుజాత ఏవైనా పుస్తకాలుంటాయేమో అని గదిలోకి వెళ్ళింది.

ఆ రెండో పెద్దగదిలోంచి టీవిలో కార్టూన్ ఛానల్ శబ్దాలు పెద్దగా వినిపిస్తున్నాయి. పోనీ చోటూతో కొంతసేపు కాలక్షేపం చెయ్యవచ్చని "ఇలా రా చోటూ కథ చెప్తా"నని తెలుగులో పిల్చింది కానీ, వాడు కార్టూన్ ఛానల్‌లో పూర్తిగా లీనమైపోయాడు. ఉన్నట్టుండి ఆ ప్రసారంలో ఏదో అంతరాయం వచ్చి ఆగిపోయింది. వెంటనే బాల్కనీలోకి పరుగుతీసిన చోటూ అక్కడ ఒక మూలగా ఉన్న నల్లటి పెట్టె మూత ఎత్తి చరచర అందులోని ఆట వస్తువులు నేల మీద పడేస్తున్నాడు. అవి చూస్తున్న సుజాత విస్తుపోయింది. గుట్టలుగా పడినవన్నీ, ఖరీదైన ఆట వస్తువులే కానీ అందులో ఒక్కటీ మానవాకారం లేదు. కనీసం టెడ్డీబేర్ అయినా కనపడలేదు. బొమ్మలే లేవు. అవన్నీ విరిగిపోయినవి. బేటిల్ జెట్లూ, స్కై స్ట్రయికర్ జెట్, రాకెట్, బూస్టర్, రేస్ కార్లూ, ఏకె-46 . ఏకె-56 లైట్ మెషిన్ గన్లూ అంటూ తడబాటు లేకుండా సుజాత అడగ్గానే వాటి పేర్లు చెప్పేస్తున్నాడు. అందులోంచి వాడు వెతుక్కుంటున్న వస్తువేదో దొరికినట్టుంది. విజయగర్వంతో అందుకుని ఫట్ ఫట్‌మని ట్రిగ్గర్ నొక్కి శబ్దం చేశాడు. అది మెరుస్తున్న తెల్లని రివాల్వర్. సైనికులు వాడే ఆయుధానికి ఏ మాత్రం తీసిపోని నమూనాలో ఉంది. అందులో పచ్చని గుళ్ళు వేసి చేత్తో పట్టుకున్నాడు. సుజాత ఆశ్చర్యంగా వాడివేపే చూస్తోంది. ఆ పూల కుండీలకు కాస్తంత వెనకాల సోల్జర్‌లాగ బోర్లాపడుకుని, తల పైకి ఎత్తి ఫట్ ఫట్ మని శబ్దం చేస్తూ షూట్ చేస్తున్నాడు. "పచ్చని గుళ్ళు ఎండిన ఆకుల్లోంచి దూసుకుపోతున్నప్పుడు ఆమెకు రెండు నిమిషాల కిందట మమత అన్న మాటలు కొంత అర్థమైనట్టనిపించింది. ఆకుల్లో రంధ్రాలు ఎందుకు పడ్డాయో- "అమ్మయ్యో!

ఆ గుళ్ళు కిందనే ఆడుకుంటున్న ఏ పిల్లల కంటికో, చెవికో తగిలితే ఎంత ప్రమాదం" అనుకుంది మనసులోనే. జోరుగా బాణాల్లా గుళ్ళు దూసుకుపోతున్నాయి.

ఇంతలో కార్టూన్ ఛానల్ సందడి మళ్ళా గదిలో వినిపించింది. ఆ చేతుల్లోని అయుధాన్ని అక్కడే పడేసి ఒక్క గంతులో మంచం మీదకురికి టీవీ ముందు కూర్చున్నాడు. బాల్కనీలో పడేసి అయుధాన్ని సుజాత చేతిలోకి తీసుకుని కుతూహలంగా చూసింది. ఏవేవో చైనా అక్షరాలున్నాయి. కొన్ని అక్షరాలు మాత్రమే ఇంగ్లీషులో ముద్రించి ఉన్నాయి. "మేడిన్ చైనా, డూనాట్ షూట్ ఎట్ హ్యూమన్ ఆర్ యానిమల్ స్మిత్ అండ్ వెస్సామ్" అన్న ఇంగ్లీషు అక్షరాలు చదివింది. అసలు సిసలు మారణాయుధాల మూసలోనే ఆట వస్తువులు తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చెయ్యడమే నేరమనీ, ఘోరమనీ ఆశ్చర్యపోతూ ఉంటే వాటినిలా ఉపయోగించకు, అలా ఉపయోగించకు అన్న సూక్తులు ముద్రించడం వల్ల కలిగే మేలేమిటా అన్న ఆలోచనలో పడింది.

మళ్ళా ఛానల్ ప్రసారంలో ఏం ఆటంకం వచ్చిందో కానీ, కార్టూన్ ఛానల్ సద్దు ఆగిపోయింది. టామ్ అండ్ జెర్రీల ల్లరి మంచి పట్టులో ఆగిపోయినట్టుంది. చెంగున గంతేసిన చోటూ బాల్కనీలోకి వచ్చి సుజాత చేతిలోని అయుధాన్ని గుంజేసుకుని, "ఈ మౌజర్ నాదీ" అన్నాడు.

"నీదే- కాదని నేనన్నానా?" అంటూ నవ్వు అపుకుంది.

"దీన్ని మమ్మీ ఝూలాఘాట్ వెళ్ళి నాకోసం తెచ్చింది తెలుసా?" కళ్ళు పెద్దవి చేసి గొప్పగా చెప్పాడు. ఆ ఊరు నేపాల్ పొలిమేరల్లో ఉందనీ, అక్కడ విదేశీ సరకులు విరివిగా దొరుకుతూ ఉంటాయనీ ఎందరో చెప్పుకోగా ఇదివరకు వింది సుజాత.

బజర్ శబ్దం వినిపించింది. స్వర్ణ వచ్చిందేమో అనుకుంది. రోడ్డు మీద ఆగిన పొడుగాటి స్కూల్ బస్సొకటి వేగం పుంజుకుని ముందుకు పోతోంది. మమత వెళ్ళి తలుపు తీసింది. లోపలికి సుడిగాలిలా దూసుకువచ్చాడు. తెల్లని స్కూల్ దుస్తుల్లో ఉన్న పన్నెండేళ్ళ కుర్రవాడు. లేసుల ముడైనా విప్పుకోకుండా కాలి జోళ్ళు

ఊడపీక్కుని ఒకటి ఒక మూలా, మరొకటి ఇంకో మూలా పడేలా గిరవాటు వేశాడు. చోటూ చేతిలోని ఆయుధాన్ని గుంజేసుకున్నాడు. చోటూ పెద్దగా ఏడుస్తూ, "ఏ మేరాహై" అన్నాడు. వెంటనే, "హూ సెడ్, తుమ్హారా గుమ్ గయా, ఏతో మేరా" అని ఒక గుద్దు గుద్దాడు వీపు మీద. ఇద్దరూ మైక్ టైసన్ శిష్యుల్లా కొట్టేసుకుంటున్నారు. చోటూ చిన్నవాడైనా మొరటుతనంలో ఏమాత్రం తీసిపోలేదు. అటూ ఇటూ విసిరేసిన స్కూలు జోళ్ళు తీసుకు వస్తున్న మమత నిస్సహాయంగా చూస్తోంది. ఇంట్లో ఎవరో ఒక కొత్త వ్యక్తి వచ్చినట్టు గుర్తించిన పెద్ద కుర్రవాడు కూడా అలా ఏ సంకోచమూ లేకుండా ప్రవర్తించడమే సుజాతను బాగా ఆశ్చర్యపరచింది.

బొమ్మలా నిలబడి చూస్తూ ' ఊరుకోలేక చిన్నవాణ్ణి పిలిచి గదిలోకి తీసుకుపోయి కాస్త మరపించే ప్రయత్నంలో "ఏవైనా తెలుగు పుస్తకాలు ఉంటే తీసుకురా, కథ చెప్తాను" అంది సుజాత. కథ అంటే... అన్నట్టు చిత్రంగా చూశాడు. "స్టోరీస్ - స్టోరీ బుక్స్ అంది సుజాత. "నో తెలుగూ బుక్స్ గ్రానీ తీసుకుపోయింది" అన్నాడు. "అదెందుకూ? వై షి డిడ్ దట్ వే?" అంది వస్తున్న నవ్వు ఆపుకుంటూ.

"నాకు గ్రానీ టెలుగూ లెటర్స్ చెప్తాను అంది. "ఏమొద్దు హిందీ, ఇంగ్లీషుతో చస్తున్నారు. బస్ చాలు అంది మమ్మీ. గ్రానీకి గుస్సా వచ్చేసింది." కళ్ళు పెద్దవి చేసుకుని అప్పుడే ఆ సంభాషణ జరిగినట్టు మిమిక్రీ చేసి వినిపించాడు చోటూ. అదే సమయానికి బజర్ శబ్దం వినిపించింది. స్వర్ణ వచ్చి ఉంటుంది. ఇక ఈ ఇరుకులోంచి బయటపడవచ్చనుకుంది.

గదిలోకి వస్తూనే, "సారీ సుజాతా! ఐ లెఫ్ట్ యూ హియర్ విదౌట్ మీ" అంటూ ఆమె గదిలో ఉన్న పెద్ద స్క్రీన్ టీవీ ఆన్ చేసింది. చేతి గడియారాన్ని చూసుకుంటూ ఏదో ఆలస్యమైపోయినట్టు నొచ్చుకుంటూ ఛానల్ మార్చి ఇంగ్లీష్ మూవీ పెట్టుకుని కాస్తంత శబ్దం పెంచింది. లేకపోతే పక్క గదిలోంచి కార్టూన్ ఛానల్ శబ్దాలు విపరీతంగా అడ్డువచ్చేలా ఉన్నాయి.

స్వర్ణ వచ్చీరాగానే ఇక నే వెళ్తానని అనలేక, మరీ బొమ్మలా కూర్చోనూ లేక సుజాత కుర్చీలో కదలాడుతూ ఉంటే, "మమతా, దో కప్ చాయ్ బనాకే లావ్.

చొటూకో దహీ చావల్ ఖిలాయా?" అని మమతకు పని చెప్పి కుశల ప్రశ్నలకు ఉపక్రమించింది స్వర్ణ.

"మా చోటూ ఏమీ బద్మాషీ చెయ్యలేదు కదా! నాటీ ఫెలో బట్ వెరీ యాక్టివ్.... ఆఫ్‌కోర్స్...." అంది.

ఏదో అనక తప్పదు. తన ఆలోచనలన్నీ ఆ మౌజర్ చుట్టూ ఇంకా తిరుగుతూనే ఉండడం వల్లనేమో నోరు విప్పి. " ఆ మౌజర్ ఎందుకు కొన్నావు? దాని కోసం ఇద్దరూ హోరాహోరీగా పోట్లాడుకున్నారు. వాడికి కొన్న ఆటవస్తువుల్లో ఫైటర్ జట్లూ, రివాల్వర్లూ తప్ప ఇంకే బొమ్మాలేదు. ఆ మౌజర్ వీళ్ళ చేతుల్లో ప్రమాదం కాదూ? అనేసింది సుజాత.

చిక్కంతా దాంతో వచ్చిపడింది. దాని వెనుక బోలెడు కథ ఉన్నట్టు ఎవరికి తెలుస్తుంది? స్వర్ణ కళ్ళు తీక్షణమై పోయాయి. వాటిలో ఎరుపు ఛాయ. ఏక ధాటిగా స్వర్ణ మాట్లాడుతుంటే సుజాత మౌనంగా వినడం తప్ప ఏం చెయ్యాలో అర్థంకాలేదు.

"నేను పిల్లల్ని పేంపర్ చేసి పాడుచేస్తున్నానని గోలెట్టేస్తాడు మా ఆయన. కొందరి ఆలోచనల్లోనూ, భయాల్లోనూ ఇంత దగ్గర పోలికలుంటాయని నాకు ఇంతవరకూ తెలియదు. వాటే సిమిలారిటీ! నువ్వూ, మా ఆయనా ఒకే ఇంట పుట్టవలసిన వాళ్ళు. ఆ మమతను పనికి పెట్టుకున్నందుకు ఊరికే చిరాకు పడిపోతాడు. ఇప్పటి నుండే మా పిల్లలు వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోవాలట. ఎవరి చేతిలోనో పిల్లలు ఆ మౌజర్ చూసి ముచ్చటపడితే ఝూలాఘాట్‌లో కొన్నాను. అదో పెద్ద నేరం. కొన్నాక మా ఇంట్లో గొడవ ఇంతా అంతా కాదు వారం రోజులు మేమిద్దరం మాట్లాడుకోలేదు. ఆ మౌజర్ చేత్తో పట్టుకోగానే కిల్లర్స్ అయిపోతారా? చెప్పు. నాకేమో నా పిల్లలు మ్యాన్లీగా అప్‌డేట్‌గా ఉండాలని సరదా. ఇరవై నాలుగు గంటలూ పిల్లలు కార్టూన్ ఛానల్ చూస్తారట. అదీ అపరాధమే? సాటి పిల్లలతో కలిసి మెలసి ఆడ్డం వాళ్ళు మిస్సయిపోతున్నారట. మా ఆలోచనలెక్కడా కలవ్వు కదా.

అలా ఏకధాటిగా చెప్పుకుపోతున్న స్వర్ణ చూపులు గోడ మీద ఎదురుగా ఉన్న పాత ఫోటో మీద నిలచాయి. సుజాతకు ఆ ఫోటో చూపిస్తూ మళ్ళీ తన ధోరణిలోకి మళ్ళిపోయింది.

"మా తాతగారిని చూశావా? అమ్మ చెప్తూ ఉంటుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హోదాలో మా వీధిలో నిలబడితే దారినపోయే జనం గజగజలాడేవారట. మా అమ్మ వీధి చివర్నే ఉన్న స్కూల్‌కి వెళ్తూ ఉంటే వెనుకనే స్కూల్ బాగ్ పట్టుకుని ఒక కానిస్టేబుల్ వెళ్ళేవాడట." స్వర్ణ ఇంకా ఇలా అనేక విషయాలను చాలా గొప్పగా చెప్పుకుపోతోంది.

సుజాత అచేతనంగా వినడమే కానీ మధ్యలో ఇక కలగజేసుకుని ఆ ధోరణిని ఆపే సాహసం చెయ్యలేదు. ఆమె ధోరణికి ఆమెను వదిలేసింది. ఆలోచనలు మాత్రం తనలో గజిబిజిగా చిక్కుపడుతున్నాయి. స్వర్ణ భర్త పట్ల కాస్తంత సానుభూతి ఏర్పడింది. పరిశోధకులు, మేధావులు అంటే తన మనసులో గీసుకున్న రేఖాచిత్రం నీళ్ళు పడి చెదిరిపోయినట్లనిపించింది.

అయితే స్వర్ణ మాటల్లో మృదుత్వం తగ్గి క్రమంగా స్థాయి పెరిగిపోతోంది. సుజాత అతి జాగ్రత్తగా తన చేతుల్ని అటూ ఇటూ సవరించుకుంటున్నట్టు తిప్పుకుని చేతి గడియారం లోకి చూపు విసిరింది. చేతిలోని ఖాళీ టీ కప్పును దగ్గర ఉన్న టేబుల్ మీద పెట్టి, "స్వర్ణా ఇక నే వెళ్ళివస్తా" నంది.

సాయంత్రం ఆరున్నర కావస్తోంది. స్వర్ణ "నే లిఫ్టిస్తానుండు" అనలేదు. సూజాతకు అదొక పెద్ద ఉపకారంగానే తోచి మనసు తేలిక పడింది. ఆ ఇంట్లో ఇక ఒక క్షణం ఎక్కువగా ఉన్నా ఊపిరాడనట్టు అనిపిస్తోంది. సరిగ్గా అదే సమయంలో బాల్కనీలో ఏదో కేకలు, ఏదో సందడి.

ఎవరో ఆటగాడు సిక్సర్ కొడితే ఇక వాడి క్రీడాభిమానులు చేసినంత హంగామా చేస్తున్నారు పిల్లలు. వెనక్కు తిరిగి చూసింది.

"మమ్మీ! మమ్మీ! అంకిత్‌నే మారా - స్పేరోకో మారా" అంటూ చప్పట్లు కొట్టి చోటూ గంతులేస్తున్నాడు. బాల్కనీలో ఒక పిచ్చుకపిల్ల గిజగిజ కొట్టుకుంటూపడి

ఉంటే, పెద్ద పిల్లవాడు చేతిలోని మౌజర్ పైకెత్తి కళ్ళు పెద్దవి చేసుకుంటూ విజయ గర్వంతో చూస్తున్నాడు.

సుజాత మెల్లగా బయటకు జారుకుంది. ఎదురుగా ఉన్న ఆటస్థలం పిల్లలతో కళకళలాడుతూ సందడిగా ఉంది. గాలి పటాలతో, బంతులతో చిన్నా పెద్దా వాళ్ళ లోకంలో ఉన్నారు.

టీవీలో ఏదో మూవీకి అంకితమైపోయిన స్వర్ణ గురించీ, కార్టూన్ ఛానల్‌కో, కంప్యూటర్ గేమ్‌కో, చిన్న చిన్న పక్షులను షూట్ చేయడానికో అంకితమైపోతున్న ఆమె పిల్లల గురించీ మనసులో ఆగకుండా సుడులు తిరుగుతున్న ఆలోచనలన్నీ ఆ క్షణం అక్కడే విడిచిపెట్టేసి, చల్లని చెట్ల నీడలో నున్నటి బాట మీద నుంచి సాగిపోయి, గేటు బయటకు వచ్చి నీలాకాశాన్ని చూసిన సుజాత గట్టిగా గాలి పీల్చుకుంది.

✣ ✣ ✣

*ఇండియా టుడే - 22 జులై 2003*

✣ ✣ ✣